కథ

# మమతల వెన్నెల మళ్ళీ కురవాలి

కె.బి.కృష్ణ

**''తాత గారూ నేను మీ దగ్గరే వుండి చదువుకుంటాను. అమ్మ అస్తమానూ చదువుకో, చదువుకో అని చంపుకుతింటుంది''అంటోంది రావు గారి ఒడిలో మనవరాలు కూర్చుని. పాప యూకేజీ చదువుతోంది. పండగకి వచ్చారు. తాత గారి మెడకు తన బుల్లి చేతులను చుట్టి కూర్చుంది. అసలు కన్నా కొసరు ఎక్కువలాగా తన కూతురు ఇదే పద్ధతిలో తన దగ్గర గారాలు పోయినప్పటికన్నా ఇప్పుడు తన మనవరాలి అనురాగ స్పర్శ ఆయన్ను ఉక్కిరి బిక్కిరి చేసేస్తోంది.**

''తప్పు, నువ్వు అలా అనకూడదమ్మా. నువ్వు బాగా చదువుకుని, పెద్ద ఉద్యోగంతో అమెరికా వెళ్లిపోవాలి. బోల్డు డబ్బు సంపాదించాలి. హాయిగా బతకాలి''అంటున్న ఆయన మాటలకు అడ్డు వచ్చి.

''తాతగారూ మనం అమెరికా వెళ్లకపోతే బోల్డు డబ్బు సంపాదించలేమా? డబ్బు సంపాదించాక హాయిగా ఎలా బతుకుతాను? దాని వలన అమ్మకు నాన్నకు ఏం ఉపయోగం?''ఆ పాప ప్రశ్నలకు జవాబు చెప్పాలంటే, జవాబు చెప్పే వయసు రావుగారికి వున్నా, ఆ జవాబును జీర్ణించుకునే శక్తి ఆ పాపకు లేదు. అందుకని ఆమె మనసు మళ్లించాలని–

''పింకీ నీకు ఓ మంచి మాట చెప్తాను. నువ్వు రోజూ పొద్దున లేవగానే ఏం చేస్తావే.''

''రాత్రేమో త్వరగా నిద్రపోను, హోమ్ వర్క్ పూర్తి చేసేస్తేనే కంప్యూటర్ గేమ్స్ ఆడుకోనిస్తానంటుంది అమ్మ. అది పూర్తి అయ్యేటప్పటికి భోజనం టైమయిపోతుంది. వెంటనే కంప్యూటర్ గేమ్స్ ఆడుకుంటుంటే అమ్మ అన్నం తినిపిస్తుంది. అలాగ పడుకునేటప్పటికి చాలా ఆలస్యమైపోతుంది. అందువలన ఉదయం లేవలేను. అమ్మేమో నన్ను కేకలేస్తూ నిద్రలేపుతుంది. చాలా సార్లు ఏడుస్తూ నిద్రలేస్తాను''అంది పింకీ.

''అలా కాదమ్మా రేపటి నుంచి నిద్ర పోయేటప్పుడు నేను రేపు అమ్మ నిద్రలేపకుండా, నేనే లేచిపోవాలి''అని పదిసార్లు మనసులో అనుకుని పడుకో. అంతే'' నీ తల దగ్గర గడియారం అలారం కొట్టినప్పుడు లేచినట్లుగా''లేచిపోతావ్.''అన్నారు.

''బలె బలే తాతయ్యా- ''అంటూ సంబరంతో పింకీ ముఖం వెలిగిపోతోంది.

''అలా నిద్ర లేవగానే, నీ రెండు అరచేతులూ కళ్లకద్దుకుని కరాగ్రే వసతేలక్ష్మీ, కర మధ్యే సరస్వతీ, కరమూలే స్థితా గౌరీ, ప్రభాతే కర దర్శనం''అని ప్రార్థించాలి. ఆ తర్వాత అరచేయి కళ్లకద్దుకోవాలి. అంటే మన చేతిలోనే లక్ష్మీదేవి, సరస్వతీ దేవి, పార్వతీ దేవి వున్నారు. అందువలన ఉదయాన్నే వాళ్లను కళ్లకద్దుకుంటే మనకు డబ్బు, విద్య, కోరికలు తీరుతాయి.''

''అవునా. నేను ఇక నుంచి అలానే చేస్తాను. నాకు కాగితం మీద ఆ శ్లోకం రాసి ఇవ్వండి తాతగారూ. రోజూ పొద్దున్నే నన్ను తిట్టుకుంటూ లేపొద్దని అమ్మకి చెప్పండి''అంది బుంగ మూతి పెట్టుకుని.

ఇంతలో–


''ఏమిటా పిచ్చివాగుడు. పుస్తకాలు తెమ్మన్నాను తెచ్చావా? ఇక సోదిచాలు గాని, వెళ్లి పుస్తకాలు తీసుకుని హోమ్‌వర్క్ చెయ్యాలి. నాకు ఇంత వరకు అయిన కోర్స్ అంతా అప్ప చెప్పాలి. చెప్పకపోయావో, అయిపోయావన్నమాటే–''అంటూ కోపంతో వచ్చింది పాపతల్లి, రావ్‌గారి అమ్మాయి.

''అదేంట్రా. పాపం కాసేపు ఆడుకోనియ్‌రా. ఎప్పుడూ చదువేగదా మీ ఇంట్లో వుంటే–''అన్నారు రావ్‌గారు.

''నాన్నగారూ దాని సంగతి మీకు తెలియదు కొంచెం చనువిచ్చామంటే చదవనే చదవదు. లే.. అలా చూస్తున్నావేం గుడ్లేసుకుని–''అంటూ కళ్లెర్రచేసి చూస్తోంది పింకిని.

''వెళ్లు నాన్నా''అని మనవరాల్ని వదిలేశారు రావుగారు.

* * *



''తాతగారూ ఏం చేస్తున్నారు''అంటూ ఫిఫ్త్ క్లాస్ చదువుతున్న మనవడు వచ్చాడు. వీడు కొడుకు కొడుకు.

రావ్‌గారి ఇద్దరి సంతానంలో అమ్మాయికి పాప, బాబు, అబ్బాయికి ఇద్దరూ అబ్బాయిలే.

''ఏం లేదురా తాతా. ఇప్పటి దాకా కబుర్లు చెప్పింది. ఇంతలో వాళ్లమ్మ హోమ్‌వర్క్ చేసుకొమ్మని కేకలేస్తే వెళ్లిపోయింది.''అంటున్న రావ్‌గారి తొడ మీద కూర్చుని, ఆయన్ను తన రెండు చేతులతో మెడ చుట్టూ గట్టిగా పట్టుకున్నాడు, మనవడు గోపీ.

''అదే తాతా నువ్వు బాగా చదువుకుని, డాక్టరైపోయి అమెరికా వెళ్లి బోల్డు డబ్బు సంపాదించి ఈ తాతను కూడా విమానంలో అమెరికా తీసుకెళ్లాలిరా'' అన్నారు రావ్‌గారు. తన చుట్టూ చుట్టుకున్న మనవడి రెండు చేతులూ ఇంకా గట్టిగా పట్టుకుని ఇంకా దగ్గరకు హత్తుకున్నారు. వాడు రావ్‌గార్ని ముద్దు పెట్టుకుంటున్నాడు. ఈ తాతా మనవల ఆత్మీయత, అనుబంధం, ఆప్యాయతలో అంత మత్తువుందా అనిపించింది. ఊపిరాడని మనవడి గట్టి బంధం నెమ్మదిగా విడిపించుకున్నారు.

''అది సరే తాతా. నువ్వు బాగానే చదువుకుంటున్నావనుకో, నేను చదువు గురించి చెప్పను అడగను. కాని ప్రతి మనిషి ఏదో ఒక స్పెషల్ విషయంతో బతకాలి. అందరిలాగే సాధారణ మనిషిలా జీవించకూడదు. నీకు డ్రాయింగ్ గానీ, పాటలు పాడడంగానీ వచ్చునా.''

''నేను పాటలు పాడతాను తాతగారూ. నాకు పాటలంటే ఇష్టం. కాని అమ్మ నన్ను సంగీతం నేర్పించమంటే, పిచ్చివేషాలు వద్దని తిడుతుంది. నాకు, టీవీల్లో పాటల పోటీల్లో కనిపించే పిల్లల్లా పాడాలని వుంటుంది. బాగా నేర్చుకుంటే నేను అంతకన్నా బాగా పాడగలను కాని-''

''నేను మీ అమ్మకు చెబుతానులే. నువ్వు సంగీతం నేర్చుకో త్యాగరాజ కృతులు అన్నమయ్య కీర్తనలు బాగా నేర్చుకో, ఆ తర్వాత సినిమా పాటలు అవే వచ్చేస్తాయి. మళ్లీ పండగకి వ చ్చేటప్పటికి నాకు మంచి కీర్తనలు వినిపించాలి''

''అలాగే తాతగారూ''అంటూ సినిమాల్లోని ఒక అన్నమయ్య కీర్తన పాడి వినిపించాడు.

రావ్‌గారు వాడిని ముద్దులతో ముంచెత్తి ''నా మనవడు చదువులోనే కాదు మంచి గాయకుడు కూడా అవుతాడన్నమాట. కీపిటప్-''అంటున్నారు రావుగారు సంబరంతో.

''అరేయ్ తాతా. మనిషి ఎప్పుడూ చదువు, డబ్బు సంపాదించడమే కాదు రోజులో ఒక్క పది నిమిషాలు భగవంతుని ప్రార్థించాలి-''ఆయన మాటలకు అడ్డు వచ్చి-.

''మాకు ఎలా కుదురుతుంది తాతగారూ. పొద్దున లేచిన దగ్గర్నుంచి కాన్వెంట్‌కి వెళ్లే గోల తప్పితే ఏముంటుంది?''అన్నాడు.

''అది కాదురా తాతా. నువ్వు ప్లాన్ చేసుకోవాలి. ఎలాగంటే నేను చెప్తాను. రోజు కన్నా అరగంట ముందు లేస్తావు. అమ్మ చెప్పకుండా బ్రష్ చేసేసుకుంటావు. చెల్లితో కబుర్లు ఆటలు బంద్. వెంటనే అమ్మకు ప్రమేయం లేకుండా బాత్‌రూమ్‌లో దూరి కాలకృత్యాలు తీర్చేసుకుని, వెంటనే పూజ గదిలోకి వెళ్లి, దేముని దగ్గర ఒక్క క్షణం కూర్చుని, రెండు అగరవత్తులు వెలిగించి ''శుక్లాంబరధరం-''అని దేవతా ప్రార్థనలు చదివి, ''దేముడా మమ్మల్ని ఈ రోజు చల్లగా చూడు''అంటూ కళ్లు మూసుకుని ప్రార్థన చేసి ఆ తరువాత చకచకా కాన్వెంట్‌లోకి వెళ్లిపో. ఎలా వుంది?''అంటున్న తాతగార్ని విప్పారిన కళ్లతో చూస్తూ, అదోరకమైన ఆనందాన్ని కళ్లల్లో నింపుకొని-.


''భలే తాతగారూ. నేను ఇక నుంచి అలాగే చేస్తాను. అప్పుడే ఎందుకులే దణ్ణాలు, దేముళ్లూ అంటోంది అమ్మ. నాకు మంత్రాలు నేర్చుకుని, చదువుకోవాలని ఉంటుందనుకొండి.''అంటున్నాడు మనవడు.

''తాతగారి దగ్గర పాఠాలు అయ్యాయా. పద కంప్యూటర్‌లో ఏదో ఎక్సర్ సైజులు చెయ్యాలని చెప్పావు కదా. చేద్దువుగాని, పాటలు, పూజలు అన్నం పెట్టవు''అంటూ కోడలు ప్రవేశించింది.

''మావయ్యగారూ. పాటలు పాడి సమాజంలో ప్రైజులు కొట్టేసే వాళ్లు, డ్రాయింగ్స్ పోటీల్లో నెగ్గే వాళ్లు, పూజలు చేసుకునే పిల్లలూ బడుద్ధాయిలండీ. వాళ్లు చదువులకి పనికిరారు. వాళ్లకు అదే వ్యాపకం. మన పిల్లలకు అవి పడవండీ. వాళ్లు బాగా చదువుకోవాలి. పెద్దవాళ్లు అవ్వాలి. మిగతావన్నీ అనవసరం కదూ ఏమంటారు?''అంది కోడలు ఆయన్ని కన్విన్స్ చేయాలని.

''ఏమంటాను ఔనంటాను''అన్నారు రావ్‌గారు.

నిజమే- జీవితానికి ఎప్పటికి ఏది అవసరమో అదే నేర్చుకోవాలి. అదే చేయాలి. అదనం పనికిరాదు. వస్తువుకు అసలువెల రాసి పన్నులు అదనం అంటారు. పన్నులు తీసుకోకుండా అసలుకు మీద తగ్గించి ఆ వస్తువును బజార్లో మనకి ఇచ్చాడే అనుకోండి, మనకు ఎంత సంబరమో. అంతే. మనిషి జీవితం అల్పానందమే. రావ్‌గారి మనసంతా వికలమైపోయింది.



పిల్లలకి చదువు, చదువు. ఉజ్వలమైన భవిష్యత్తు, విదేశాలకు ప్రయాణం. అంచనాలకు మించి సంపాదించాలన్న ఆశలు, సంపన్నమైన, విలాసవంతమైన జీవితం, ఇవే ఆశయాలు, విటమిన్ డ్రాప్స్‌లా వేస్తున్నారు పసితనం నుంచే. పిల్లలకు ఆటలు పాటలు

లేవు అమ్మమ్మ, తాతలకు ప్రేమానురాగాలు పంచుకో వడం, నానమ్మ తాతలతో అనుభవాలు నేర్చుకోవడం వినడం పాఠాలు నేర్చుకోవడం అంతా విసుగు. ఇక పోతే కంప్యూటర్ అనే మాయదారి సిస్టమ్ ఒకటి పిల్లల మెదళ్లు నంజుకుని తినేస్తోంది. పిల్లలకు ఇటువంటి జైలు శిక్షలు విధించటం ఎంత వరకు సమంజసం?

నాణ్యమైన జీవితం అంటే తిండికి, నిత్యావసరా లకు ఇబ్బంది లేకపోవడం, అవసరానికి మించి సంపాదనా, తద్వారా రాజ భోగాలు అనుభవించ డమే కాదు, ఒకరి పట్ల మరొకరు గౌరవాభిమానాలు, ఆప్యాయతలు, అనురాగాలు, అనుబంధాలు, ఆత్మీ యంగా అక్కున చేరే మనవలూ, మనమరాళ్లూ, ఆప్యాయంగా పలకరించి, ఆదరించే కూతుళ్లు, అల్లుళ్లు, కొడుకులూ కోడళ్లు కనుమరుగైపోతున్నారా?

కథలు చెబుతూ గోరు ముద్దలు తినిపించే అమ్మమ్మ, జోలపాట పాడి నిద్రబుచ్చే అమ్మ వొడిలో కూర్చోబెట్టుకుని బుజ్జగిస్తూ పాలు తాగించే నాన్న గారు, స్కూలుకు వెళ్లే ముందు తల దువ్వి జడలు వేసే అక్కయ్య, "నా కంపాస్ బాక్స్ తీసుకుంటావా" అంటూ చెల్లిని తలపై మొట్టికాయ మొట్టి, అది ఏడు స్తుంటే "నా తల్లి కదూ ఏడవకే బాబూ సాయంత్రం వచ్చేటప్పుడు నీకు పాలకోవా తెస్తాను. అంటూ గెడ్డం పట్టుకుని బతిమిలాడే అన్నయ్య "అమ్మాయి గారూ రేపు వచ్చేటప్పుడు మీకు జున్ను పాలు తెస్తాను" అంటూ ఆప్యాయంగా మాట్లాడుతూ పాలు పోసే

అమ్మాయి చెప్పింది, నాన్నగారికి మరీ చాదస్తం ఎక్కువైందనీ అలా వుండద్దని చెప్పింది. మీ కాలం నాటి పిల్లల పెంపకం, పిచ్చి ప్రేమలు, అనుబం ధాలు కాదు ఇప్పుడు ముఖ్యం, జీవితం వేగం అయిపోయింది. పరుగులు పెడుతున్నాం. మామానాన మమ్మల్నీ పిల్లల్నీ వదిలేయండి అంది.

అమ్మాయి "అమ్మగారూ మీకు ఇష్టం అని పొట్టివంకా యలు తెచ్చాను. గుత్తి వంకాయ కూర వండుకోండి" అంటూ కొసరుగా రెండు వంకాయలు వేసే కూరగా యల అబ్బీ, సాయంత్రం చీకటి పడుతుంటే "పిల్లలు ఇంకా రాలేదు. ఎందుకు ఆలస్యమైందో"అన్న ఆందో ళనతో నిండిన వేయి కళ్లతో, కళ్లల్లో పిల్లలకు ఏమ యిందో అన్న ఆవేదనతో ఎదురు చూసే మాతృ మూర్తి ఇవన్నీ మరుగున పడిపోయాయా?

ఇవన్నీ ఊహల్లో ఊహించుకోవాల్సిన మధుర మైన ఆలోచనలైపోయి కూర్చున్నాయా?

ఈ మమతానుబంధాల కరువు ఆధునికం సృష్టిం చిన అగాధమా? ఏమిటో రావ్‌గారి మనస్సు విచా రంగా మారిపోయింది.

ఇంతలో-

"లేవండి. టిఫిన్ చెయ్యండి. నీరసం వస్తుంది. మన అబ్బాయి, మన అమ్మాయి పెంపకం, వాళ్ల బాగోగులే మనకు ముఖ్యం అవి తీరిపోయాయి. వాళ్ల పిల్లల గురించి మనకు అనవసరం. ఒక వేళ మీకు ప్రేమ వుందనుకోండి దగ్గరగా లాక్కుని ఒక్కక్షణం ఆ స్పర్శలో ఆనందానుభూతిని పొందండి. ఇంకా ప్రేమ తీరకపోతే వాళ్లకు ఇష్టమైనవి కానుకగా కొని ఇవ్వండి. అంతేగాని వాళ్ల రొటీన్ జీవన విధానాన్ని మార్చాలని గాని, వాళ్లని మనదైన జీవన శైలిలోకి మార్చుకోవడానికి ప్రయత్నించడంగాని చెయ్యకండి-" అంటున్న శ్రీమతి ఉపన్యాసానికి అడ్డువచ్చి రావ్‌గారు.

"అంతేనంటావా?"

"అంతే, ముమ్మాటికీ అంతే. మీరు మీ మనవ లకు, మనవరాళ్లకు ఏం చెప్పినా అనవసరపు ప్రసం గంలా వుంటుంది. మరో పక్కన వాళ్ల పిల్లలకి నీతులు చెప్పి పాడు చేస్తున్నారేమోనన్న అనుమానం కూడా వాళ్లమనసుల్లో పొడ సూపవచ్చును తెలుసా మీకు" అంటున్న శ్రీమతి, కురుక్షేత్రంలో రథంపై మోకాళ్ల మీద విచార వదనంతో కూర్చున్న అర్జునునికి, గీత భోదిస్తున్న కృష్ణపరమాత్మునిలా కనిపించింది.

"అవును నిజమే"అన్నాడు రావ్‌గారు.

"వాళ్లు మనింట్లో వున్నన్నాళ్లూ వాళ్లతో ఎంజాయ్ చెయ్యండి వారి అలవాట్లు గాని, వాళ్ల రొటీన్ లైఫ్‌ని గాని మార్పించడానికి ప్రయత్నించకండి. అర్ధమైం దా?"అంటోంది రావ్‌గారి శ్రీమతి.

"అర్ధమౌతోంది-"అంటున్న రావ్ గారికి టిఫిన్ సర్వ్ చేసింది.

"అర్థం చేసుకోడానికి ప్రయత్నించాలి"అనుకుం టున్నారు రావ్‌గారు. అసలు ఈ మనుషులు నాకు అర్థం కాని సమస్య అయి కూర్చున్నారేమో అనిపిం చిందాయనకు.

***

రెండు రోజుల్లో కొడుకు కోడలూ, కూతురు అల్లుడూ, మనవలు, మనవరాళ్లు వెళ్లిపోతారు. ఆ రోజు రావ్‌గారు నలుగురు మనవల్ని తీసుకుని, ఈవె నింగ్ వాక్‌కి వెళ్లాలనుకున్నారు. వాళ్లతో ప్రోగ్రామ్ పెట్టుకున్నారు. పార్కులో మనవలతో బాగా ఆడుకో వాలి. వాళ్లకు ఎంతో ఇష్టమైన ఐస్‌క్రీమ్స్ కొనివ్వాలి. వాళ్లకేం కావాలో కనుక్కుని మర్నాడు బజారుకు తీసుకువెళ్లి అవి కొనిపెట్టాలి. ఇలా ఆలోచనల్లో ఉన్నారు రావ్‌గారు. తన పర్సనల్ రూమ్‌లోంచి బయటకు వచ్చి "ఏమోయ్ ఇల్లంతా ఖాళీగా వుంది. ఏరీ వీళ్లంతా-"అన్నారు.

"పెద్దవాళ్లేమో షాపింగ్‌కి వేళ్లారు. ఎల్లుండి ఊళ్లకు వెళ్లిపోతారుగదా, వాళ్ల ఊళ్లల్లో దొరకనివి కొనుక్కుం టామని వెళ్లారు. మనవలు కంప్యూటర్ గేమ్స్ కొత్తవి వచ్చాయని కొనుక్కోవడానికి వెళ్లారు. అట్నుంచే 'హారీపోటర్'సినిమాకి వెళ్తామన్నారు.-"

"అదేమిటి నాతో ఈవెనింగ్ వాక్‌కి వస్తామన్నారు గదా. పార్కులో వాళ్లతో ఎన్నో ఆటలు ఆడుకోవాలని, వాళ్లకు కావాల్సినవి ఇష్టమైనవి కొనిపెడదామని కూడా అనుకున్నానే-"అంటున్న రావ్‌గారి ముఖం వైపు చూస్తూ ఆయన భార్య-.

"చూడండి, ఎంతసేపు మన పిల్లలు, వాళ్ల పిల్లలు, ఇలా బాధ్యతలు మొయ్యడమేనా మన పని. మనకంటూ మానసికంగా, శారీరకంగా రిలీఫ్ కావద్దూ. మీరు లేనిపోని ఆలోచనలతో అశాంతితో అలమటించిపోతున్నారు. నేను పిల్లలు వచ్చినప్పు డల్లా వాళ్లకు కావాల్సినవన్నీ అమరుస్తూ, వంటపని చేసి చేసి శారీరకంగానూ, మానసికంగానూ అలిసిపో తున్నాను. ఇక ఈ సంప్రదాయాన్ని మార్చేద్దాం మనం-.

మనం అనుకునే అమూల్యమైన అనుబంధాలు, ఆప్యాయతలు, మానవ సంబంధాలు, ఆధునిక ఒత్తిళ్ల మధ్యన నలిగిపోతున్నాయి. సెల్‌ఫోన్స్ మీద నడిచే జీవితాలు, విపరీతంగా పెరిగిపోతున్న జీతాలు, తద్వారా ఏ బ్యాంకులో పొదుపు చేయాలనుకునే విప రీతమైన ఆలోచనలు, మరో పక్కన మన పెరగని ఆదాయం, ఒకదానికి మరొకటి పొంతన లేకుండా సమాంతరంగా ప్రయాణిస్తున్నాయి."అంటోంది రావ్‌గారి శ్రీమతి.

"అవును"అన్నారు రావ్‌గారు తలదదించుకుని-.

"ఇంకో మాట మీరు గుర్తుకు పెట్టుకోండి. అమ్మాయి చెప్పింది, నాన్నగారికి మరీ చాదస్తం ఎక్కువైందనీ అలా వుండద్దని చెప్పింది. మీ కాలం నాటి పిల్లల పెంపకం, పిచ్చి ప్రేమలు, అనుబంధాలు కాదు ఇప్పుడు ముఖ్యం, జీవితం వేగం అయిపో యింది. పరుగులు పెడుతున్నాం. మామానాన మమ్మల్నీ పిల్లల్నీ వదిలేయండి అంది. మా వ్యవహా రాల్లో కలగ చేసుకోవద్దని చెప్పమన్నారు. మా పిల్లల్ని మాకు దూరం చెయ్యద్దని కూడా చెప్పారు. అమ్మాయి ఈ మాటలు అంటుంటే అందరూ మౌనంగా ఉన్నారు. చెప్పానుగా రొటీన్‌కి భిన్నంగా మనం వ్యవ హరించకూడదు-"ఆమె మాటలకు అడ్డు వచ్చారు. రావ్ గారికి గుండె చప్పుడు గొంతులోకి వచ్చింది.

"వద్దు ఇక చెప్పొద్దులే, పరుగు పందెంలా నడిచే ఈ యాంత్రిక జీవితంలో మనం కూడా మరమను షుల్లా మారిపోయి మమతలు కరువై మనుగడ సాగి స్తున్నాం. బాల్యం నుంచి వృద్ధాప్యం వరకూ మనిషి జీవితంలో ఏ దశ తీసుకున్నా అనుబంధాల విష యంలో నిస్సారంగానే వుంటోంది. బయటకు ఎంతో మంది చెప్పలేకపోతున్నారుగాని, మౌనంగా భరిస్తున్నారు ఈ జ్వాలని. ఈరోజు నుంచి నాకు నువ్వు, నీకు నేను అంతే. మిగిలిన బంధాలు మనవి కాదనుకుంటే పోలా.

మా అమ్మానాన్నా, నువ్వూనేనూ కలిసి నేలమీద పీటలు వేసుకుని భోజనం చేసిన సందర్భాలూ, మా నాన్న నన్ను దగ్గర కూర్చోపెట్టుకుని జీవితం ఎలా గడపాలో సూచనలు ఇచ్చిన సమయం, పెళ్లయ్యాక కూడా మా అమ్మ ఒడిలో నేను తలపెట్టుకుని గారాలు పోయిన వైనం, మీ నాన్నగారు నిన్ను నాకూడా పంపిస్తూ నిన్ను ఎలా చూసుకోవాలో, సంసారం ఎలా కొనసాగించాలి అన్న విషయాలు వివరంగా నాతో చర్చించిన సందర్భం, ఎంత ఉన్నత మైనవి, అమూల్యమైనవి?

ఏవీ ఆ రోజులు?

ఎక్కడ ఆ మనుషులు?

మళ్లీ మనం బతికుండగా చూడగలమా?

ఆ ఆప్యాయతలూ, అనురాగాలూ, ఆ మమతల వెన్నెలలు మళ్లీ కురుస్తాయంటావా.. ఏమో..-"అం టున్న రావ్ గార్ని భుజంపై ఆప్యాయంగా తడుతూ.

"మీ మీ అనుభవాలు, అనుభూతులు డైరీలో రాసుకోండి. అదే ముందు తరాలకు భగవద్గీత" అంటోంది ఆయన శ్రీమతి. అవును.

◆